క్లుప్తంగా

రామాలయ ప్రారంభోత్సవానికి చాగంటికి ఆహ్వానం



చాగంటి కోటేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాజా, శ్రీనివాస్

పెద్దాపురం: వచ్చే నెల 8న స్థానిక నాయీ బ్రాహ్మణ కాలనీలో నిర్వహించే కోదండరామ ఆలయ ప్రారంభోత్సవానికి చాగంటి కోటేశ్వర రావు హాజరుకానున్నట్లు వార్డు కౌన్సిలర్ విడదాసరి రాజా తెలిపారు. శుక్రవారం ఆయన రామాలయ కమిటీతో కలసి చాగంటి కోటేశ్వర రావుకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. పట్టణంలో రామాలయ ప్రతిష్ఠ అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని రాజా తెలిపారు. ఆయన వెంట తమిరి శ్రీనివాస్, రాకుర్తి పుల్లయ్య, నాగబాబు తదితరులున్నారు.

రేపు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

కాకినాడ కల్చరల్: స్థానిక పైడా గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల సమావేశపు మందిరంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించనున్నట్లు వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ తెలిపారు. ఆస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్య నరసింహ శాస్త్రి, కార్యదర్శి కాకరపర్తి దుర్గాప్రసాద్ ప్రధాన వక్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ప్రతి శుక్రవారం డ్రైడే



గొర్రిపూడిలో రుబ్బురోళ్లలోని నీటిని పారబోయిస్తున్న సిబ్బంది

కరప: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కరప, పెనుగుదురు, అరట్లకట్ట, గొర్రిపూడి, సిరిపురం తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామ కార్యదర్శులకు డ్రై డేపై పలు సూచనలు ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి నీరునిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయించాలని, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని సూచించారు.

22న బీసీ జనభేరి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నాయకుడు వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: బీసీ హక్కుల సాధనకు ఈ నెల 22న మంగళగిరిలో చేపట్టే బీసీ జనభేరిని విజయవంతం చేయాలని రాష్ట్ర బీసీసేన ఉపాధ్యక్షులు యనమదల రవి కోరారు. కాకినాడలో బీసీ సేన వాల్‌పోస్టర్‌ను నాయకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం రామారావుపేటలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో బీసీ గణన చేపట్టేలా సీఎం జగన్ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరిలో జరిగే జనభేరికి బీసీ సేన అధ్యక్షులు కౌంటి నాగరాజు అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరవుతారన్నారు. బీసీ సేన జిల్లా అధ్యక్షుడు కండేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ బీసీ సమస్యలపై ఈ సభలో చర్చిస్తామన్నామన్నారు. బీసీ నాయకులు కొప్పిశెట్టి చంద్రమౌళి, వాసంశెట్టి రాజేశ్వరరావు, మాదారపు సత్యనారాయణ, ధోని చిట్టిబాబు, మల్లిపూడి రామకృష్ణ, విత్తనాల రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్ అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం

బాలాజీచెరువు: పీఆర్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో డిగ్రీ, పీజీ, సంస్కృతంలో డిగ్రీ మూడేళ్లు, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.68 వేల స్కాలర్‌షిప్‌లను బెంగళూరుకు చెందిన అధాడో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చలపతిరావు కాసరబాద శుక్రవారం అందజేశారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు సోల్డరింగ్ అండ్ డీసోల్డరింగ్ ఆఫ్ కాంపోనెంట్స్, ఏడాన్ సర్టిఫికెట్ కోర్సు, అప్లికేషన్ ఆఫ్ సోలార్ సెల్స్ ఇన్ హోమ్ ఎనర్జీ సిస్టమ్‌ల ద్వారా నైపుణ్యం సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం, అధ్యాపకులు కృష్ణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎలియా, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్మోగుతున్న పంచాక్షరి

- శివరాత్రికి శైవాలయాలు ముస్తాబు
- తెల్లవారుజాము నుంచే దర్శనానికి ఏర్పాట్లు
- పూల మాలలు, విద్యుద్దీపాలతో అలంకరణలు



సూర్యారావుపేట బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న కైలాస సహస్ర మహాలింగేశ్వర ఆలయం

బోట్‌క్లబ్: నగరంలో శైవ క్షేత్రాలు శోభాయమానంగా కనిపిస్తున్నాయి. శనివారం, మాస శివరాత్రి, మహాశివరాత్రి, శనిత్రయోదశి ఒకే రోజు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలో పలు ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు నిర్వహించేలా ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నగరంలోని దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి తెలిపారు. లింగోద్భవ సమయంలో హారతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఈఓ ఎం.మురళీవీరభద్రారావు, రామారావుపేట అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో, సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల అధికారుల తెలిపారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతిర్లింగ దర్శనం, మహాశివునికి విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు. వీటితో పాటు జగన్నాథపురంలో సర్వేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తినగరంలో శివాలయంతో పాటు పలు శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కాకినాడ రూరల్: మహా శివరాత్రి కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే పలు చోట్ల కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. సూర్యారావుపేట బీచ్ రోడ్డులో ఉన్న కాత్యాయిని సమేత కైలాస సహస్ర మహా లింగేశ్వరస్వామి ఆలయం, సమీపంలోని నేమాం గ్రామంలో పర్వత వర్ధిని సమేత ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, పండూరు, రమణయ్యపేట గోకుల్ గార్డెన్, ఆర్టీసీ కాలనీ శివాలయాలు, సర్పవరం, కొవ్వూరు, తూరంగి, ఇంద్రపాలెం తదితర గ్రామాలలో ఆలయాల్లో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. సర్పవరంలో శనివారం మధ్యాహ్నం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.



బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరుని ఆలయంలో విద్యుత్ అలంకరణలో శివలింగం



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన దేవాలయం వీధిలోని భీమేశ్వర ఆలయం


ఘనంగా నీలకంఠేశ్వర కల్యాణం



సర్పవరం శివాలయంలో నిర్వహిస్తున్న భవానీ సమేత నీలకంఠేశ్వర కల్యాణం

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి కల్యాణం ఘనంగా జరిగింది. అర్చకుడు నాగేంద్ర శర్మ బృందం కల్యాణం నిర్వహించారు. యాళ్ల రత్నారావు పద్మ దంపతులు, మల్లెపూడి అప్పారావు వరలక్ష్మి దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. శివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం నుంచి అభిషేకాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పల్లి సత్యనారాయణ తెలిపారు.

ఆకట్టుకున్న శివతాండవం



ఆకట్టుకున్న శివతాండవ చిత్రం



చిత్రకారుడు శేషగిరిరావు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన భమిడిపాటి శేషగిరిరావు తన చిత్రం ద్వారా శివభక్తిని చాటుకున్నారు. మహాశివరాత్రి పురస్కరించుకొని గీసిన ఈ చిత్రం భక్తులను ఆకట్టుకుంటోంది.

ఆదిత్య ఆధ్వర్యంలో అద్వితీయ 2కే-23



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ మహిళా కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అద్వితీయ–2కే 23 సదస్సు స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కె.కరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎస్ఎన్‌కేఎస్ లైటింగ్ మ్యాన్యుఫాక్చరింగ్ డైరెక్టర్ నిఖిల్ సత్యకాంత్, బీకే ఫుడ్ ప్రొడక్ట్ ఎండీ హిమబిందు సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. ఇటువంటి సదస్సులు కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడతాయని పేర్కొన్నారు. అనంతరం మార్కెటింగ్, ఫైనాన్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల కార్యదర్శి సుగుణారెడ్డి, నాగశ్రీకాంత్, బీబీఏ హెడ్ జి.అబ్రహం పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహించాలి : జేసీ ఇలక్కియ



ప్రదర్శనలో చీరలు పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియా

బోట్‌క్లబ్: హస్త కళాకారులను ప్రోత్సహించాలని జేసీ ఇలక్కియా అన్నారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని డీసీఎంఎస్ గ్రౌండ్‌లో లేపాక్షి హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శనను శుక్రవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. హస్తకళలకు విస్తృత ప్రచారం కల్పించడం, అభివృద్ధి, హస్తకళలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ సహకారంతో కాకినాడలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శుక్రవారం నుంచి 26 వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నర్సాపూర్, జైపూర్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో తయారుచేసిన వస్తువులతో 50 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఇతర హస్తకళల వస్తువులతో పాటు కళంకారి, పోచంపల్లి వంటి ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన, విక్రయాలను కాకినాడ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమె స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ మంజుల, లేపాక్షి షోరూం మేనేజర్ వీరబాబు పాల్గొన్నారు.

పల్లె జీవనంపై అవగాహన అవసరం

- నగర మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న



రైతు వేషధారణలో పండ్లు, కూరగాయలు విక్రయిస్తున్న చిన్నారి

బాలాజీచెరువు: నేటి ఆధునిక జీవనంలో పట్టణ వాతావరణానికి అలవాటు పడిన చిన్నారులకు పల్లె వాతావరణం, అక్కడ జీవన స్థితిగతులపై అవగాహన కల్పించాలని నగర మాజీ మేయర్ సుంకర శివప్రసన్న పేర్కొన్నారు. స్థానిక నరసన్ననగర్ గీతం పాఠశాలలో శుక్రవారం పల్లెటూరు జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సెట్టింగ్ వేసి అక్కడ పండించే కూరగాయలు, రైతుబజార్‌లో విక్రయించే విధానం తదితర వాటిపై అవగాహన కల్పిస్తూ చిన్నారులకు వేషధారణ వేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఏర్పాటుచేసిన స్టాల్స్ సందర్శించి కూరగాయలు వాటి రేట్లు, పువ్వులు వంటి వాటిపేర్లు తదితర వాటిని అడిగి తెలుసుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సూజాత, డైరెక్టర్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ సురభి శారద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణంలో అలుగుల పాత్ర ప్రత్యేకం

- కలెక్టర్ కృతికా శుక్లా



పాంగోలిన్ పరిరక్షణపై రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఈ నెల 18న ప్రపంచ పాంగోలిన్ (అలుగు) దినోత్సవం సందర్భంగా ఈ జీవి పరిరక్షణపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు కన్జర్వేషన్ బయాలజిస్టు డాక్టర్ ఈశ్వర్ నారాయణ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా ఆవిష్కరించారు. జీవ వైవిధ్యం పరంగా విశిష్టత, ప్రత్యేకత కలిగిన పాంగోలిన్ పర్యావరణానికి అందిస్తున్న సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అంతరించిపోతున్న జీవ జాతుల జాబితాలో ఉన్న అలుగుల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏటా ఫిబ్రవరి, మూడో శనివారం ప్రపంచ పాంగోలిన్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు డాక్టర్ ఈశ్వర్‌నారాయణ తెలిపారు. అలుగులు–పర్యావరణ ప్రాముఖ్యతపై శుక్రవారం మధ్యాహ్నం ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

కాకినాడ క్రైం: కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు స్పోర్ట్స్ కోటాలో మహిళా సంరక్షణ కార్యదర్శులుగా ఉద్యోగాలు పొందిన ఏడుగురు మహిళలకు ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు శుక్రవారం ఆయన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. పత్రాలు పొందిన వారిలో వనిత, విశాలాక్షి, వరలక్ష్మి, కుసుమకుమారి, జీజే వరలక్ష్మి, అరుణ, కృపావతి ఉన్నారు.

జీజీహెచ్‌లో ఎంఎన్ఓ చేతివాటం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఎంఎన్‌వోల చేతివాటం రోగులకు ఇబ్బందిగా మారుతోంది. వివరాల్లోకి వెళ్తే.. సామర్లకోట మండలం ఉండూరు గ్రామానికి చెందిన వెదుళ్ల తులసమ్మ గర్భసంచి ఇన్‌ఫెక్షన్‌తో ఈ నెల 14న జీజీహెచ్‌లో చేరింది. వైద్యులు ఆమెకు బయాప్సీ చేయాలని నిర్ణయించి శుక్రవారం ఉదయం ఆ ప్రక్రియ నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్ నుంచి తిరిగి ఆమెను వార్డుకు చేర్చిన ఎంఎన్‌వో ఆమెను వీల్‌చైర్‌లో తీసుకువెళ్లి తీసుకువచ్చినందుకు రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. గత్యంతరం లేని పరిస్థితిలో రోగి భర్త రాంబాబు రూ.2,500 ముట్టచెప్పాడు. ఇదే విషయమై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవికి సైతం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎంఎన్‌వోను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె హెచ్‌వోడీని ఆదేశించారు.

మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు

కాకినాడ సిటీ: ప్రధాని మోదీపై డాక్యుమెంటరీ విడుదల చేసిన బీబీసీపై ఐటీ దాడులు చేయించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.నవీన్‌రాజు అన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. 2022లో గుజరాత్ మారణహోమంలో నాటి సీఎం మోదీ పాత్రను బయటపెట్టినందుకు బీబీసీపై వేధింపులకు దిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని మీడియా హక్కులను హరించాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. మీడియా ప్రతినిధులు ఏ.ఎలీయా, ఎస్‌కె సలీం, వి నానాజీ, వి గోపీనాథ్, లక్ష్మణ్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఆపద మిత్రలకు సర్టిఫికెట్లు అందజేసిన వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపదమిత్రల మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై 12 రోజులుగా పొందిన శిక్షణ అంశాలను అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసి, ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఆర్ నీహారిక, వి.ప్రసాద్, ఎస్‌కె మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ఉత్తమ శిక్షణ పొందిన వారికి మెమెంటోలు అందజేశారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం

- నేడు పంచారామ క్షేత్రంలో వేడుకల ప్రారంభం



కుమార రామభీమేశ్వరస్వామి



బాలా త్రిపుర సుందరీదేవి

సామర్లకోట: రాష్ట్రంలో అతి ప్రాచీన పంచారామక్షేత్రాల్లో కుమారరామ భీమేశ్వర క్షేత్రం ఒకటి. పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంగా పిలుస్తున్నారు. ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం జరిగింది. 19న రథోత్సవం జరగనుంది. 21వ తేది రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

శనిత్రయోదశి రోజునే మహాశివరాత్రి రావడం అరుదైన విషయమని పండితులు అంటున్నారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వారంటున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద ఉచిత, దర్శనంతో పాటు రూ.30, రూ.50, రూ.100 దర్శనాలతో పాటు, అభిషేకానికి రూ.200, రుద్రాభిషేకానికి రూ.వెయ్యిగా నిర్ణయించారు. ఇప్పటికే క్యూలైన్లతో పాటు, వీఐపీలకు ప్రత్యేక నిచ్చెనలు ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు, ప్రైవేటు సెక్యూరిటీ ఏర్పాటు చేసినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. ఉప్పువారి సత్రం నుంచి పాలు, మజ్జిగ, లయన్స్ క్లబ్ నుంచి అల్పాహారం, మజ్జిగ, పారిశ్రామిక వేత్త కర్రి వెంకట్రాజు వాటర్ ప్యాకెట్లు, 25 వేల మందికి భోజనాలు, వాసవీ ఫ్రెండ్స్ నుంచి భక్తులకు భోజనాలు, కొండపల్లి బ్రదర్స్ పేరున పాలు, మజ్జిగ పంపిణీ చేయడానికి ఇప్పటికే అధికారుల నుంచి అనుమతి పొందారు. వేట్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, పెద్దాపురం అగ్నిమాపక సిబ్బంది ఆలయం వద్ద సిద్ధంగా ఉంటారని అధికారులు తెలిపారు.

పాదగయలో ఏర్పాట్లు పూర్తి

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి లక్షకుంకుమార్చన, లక్షచామంతి పూజ నిర్వహించారు. పండితులు ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్వర్ణ, రజత పుష్పాలతో మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి శుక్రవారం స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు స్వర్ణపుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో ఏఎంజీ పాఠశాలలో జిల్లా సైన్స్ ఫేర్

కాకినాడ సిటీ: ఈనెల 22, 23 తేదీల్లో ఏఎంజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్సు ఫేర్‌కు తీసుకోవాల్సిన చర్యలపై డీఈఓ అన్నపూర్ణ కమిటీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్ర ఏఎస్‌ఏ సమావేశ మందిరంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సైన్స్ ఫేర్‌కు జిల్లాలో 21 మండలాల నుంచి 105 ప్రాజెక్టులు, 5 సబ్ థీమ్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాకినాడ అర్బన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జెడీ రాజు మాట్లాడుతూ సైన్స్ ఫేర్ నిర్వహణ బాధ్యతలకు కమిటీల ఏర్పాటు, కమిటీలు నిర్వర్తించే పనులను తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, అర్బన్ డీఐ వీపీజీ వాణీకుమారి, రూరల్ మండల ఎంఈవో ఎల్.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో శాంతియాత్ర

పిఠాపురం: త్రిమూర్తి శత జయంతి సందర్భంగా గొల్లప్రోలు ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లప్రోలులో శాంతి యాత్ర నిర్వహించారు. గొల్లప్రోలు ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం కార్యాలయం వద్ద భారీ శివలింగం ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పుర వీధుల్లో శాంతి యాత్ర చేసి ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సభ్యులు పాల్గొన్నారు.